

చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



టమాట కిలో రూ.36

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.36 పలికింది. కనిష్టం రూ.20. సరాసరి రూ.28 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.7°/ 15.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

30న నేమకల్లుకు సీఎం



నేమకల్లులో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

బొమ్మనహాళ్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 30న బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ జగదీష్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మంగళవారం గ్రామంలో పర్యటించారు. హెలిప్యాడ్, గ్రామ సభ స్థలాన్ని పరిశీలించారు. ముందస్తు భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. రూట్ మ్యాప్‌లను ఎస్పీ వీక్షించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈఈ రవిశంకర్‌రెడ్డి, తహశీల్దార్ మునివేలు, సీఐలు వెంకటరమణ, జయనాయక్, ఎస్‌ఐలు నబీరసూల్, నాగమధు, గురుప్రసాద్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ దాస్, సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ అధికారి పేరిట బురిడీ కొట్టించే యత్నం

- అప్రమత్తమై పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రమేష్

గార్లదిన్నె: సీబీఐ అధికారి అంటూ కాల్ చేసి డబ్బు లాగేందుకు యత్నించాడో ఓ అగంతకుడు. అయితే, వెంటనే అప్రమత్తమైన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల డ్యాంకు చెందిన రమేష్, విమల దంపతులు. వీరి కుమారుడు యశ్వంత్ కర్నూలు జిల్లాలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం రమేష్ సెల్‌కు ఓ వాట్సాప్ కాల్ రాగా, విమల మాట్లాడారు. తాను సీబీఐ అధికారి అని చెప్పుకున్న అవతలి వ్యక్తి... 'మీ కుమారుడు యశ్వంత్‌ను మాదక ద్రవ్యాల కేసులో అరెస్ట్ చేశాం. రూ.20 వేలు పంపిస్తే వదలి పెడతాం' అంటూ మాట్లాడి కాల్ కట్ చేశాడు. కంగారు పడిన ఆమె భర్తకు విషయం తెలియజేసింది. వెంటనే రమేష్ కుమారుడికి ఫోన్ చేయగా.. తాను కళాశాలలోనే ఉన్నానని తెలిపాడు. దీంతో ఈ విషయంపై రమేష్ 1930కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. మంగళవారం గార్లదిన్నె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని విచారించిన పోలీసులు సదరు అగంతకుడి నంబర్ నకిలీది అని తేల్చారు. ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా మాట్లాడుతూ తెలియని నంబర్ల నుంచి కాల్స్ వస్తే స్పందించరాదన్నారు. వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మాజీ వలంటీర్‌పై పచ్చ మూకల దాడి



గాయపడిన ఓబుళపతి

పెద్దవడుగూరు: మండల పరిధిలోని ముప్పాలగుత్తి గ్రామంలో మాజీ వలంటీర్ ఓబుళపతిపై అదే గ్రామానికి చెందిన పచ్చ మూకలు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు తెలిపిన మేరకు.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఓబుళపతిపై టీడీపీ నాయకులు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. దీంతో అతను గ్రామం వదిలి తాడిపత్రిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తల్లిదండ్రులను చూడటానికి ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు రాజశేఖర్‌తో పాటు మరో ఇద్దరు ఓబుళపతి ఇంటిపై దాడి చేశారు. ఓబుళపతిని కొట్టారు. బాధితుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. తన ఇంట్లోని టీవీ, ఇతర వస్తువులను కూడా టీడీపీ నాయకులు ధ్వంసం చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ఎండుమిర్చి @ రూ.18,500

హిందూపురం అర్బన్: మార్కెట్‌లో ఎండు మిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు 144 మంది రైతులు 159.20 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకువచ్చారు. మొదటి రకం మిర్చి క్వింటా రూ.18,500, రెండో రకం క్వింటా రూ.9 వేలు, మూడో రకం ఎండు మిర్చి క్వింటా రూ.7 వేల మేర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. తుపాను ప్రభావంతో ఎండుమిర్చి నాణ్యత అంతంతమాత్రంగా ఉందని ఆయన వెల్లడించారు.

డైయాలసిస్..!



ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఆంజనేయులు. అనంతపురం రూరల్ పరిధిలోని కొడిమి నివాసి అయిన ఇతను కొన్నేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అనంతపురం సర్వజనాస్పత్రిలో వారంలో మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంది. ఆంజనేయులు గతంలో 108 వాహనంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆస్పత్రికి వచ్చేవాడు. అయితే, కూటమి సర్కారు ఇటీవల వాహనాలను నిలిపివేయడంతో కుమారుడితో కలిసి బైకులో అవస్థలు పడుతూ రావాల్సి వస్తోంది. ఆంజనేయులు ఒక్కరే కాదు రవాణా సౌకర్యం లేక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందల మంది రోగులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.



అనంతపురం సర్వజనాస్పత్రిలోని డయాలసిస్ విభాగం

- నరకయాతన అనుభవిస్తున్న కిడ్నీ బాధితులు
- ఆస్పత్రికి వచ్చేందుకు అందుబాటులో లేని 108 వాహనాలు
- సొంత ఖర్చులతో రాలేక ఆపసోపాలు
- డయాలసిస్‌కు ఒక రోజు ఆలస్యమైనా తీవ్ర సమస్యలు
- కూటమి సర్కారు నిర్వాకంతో ఇప్పటికే నలుగురి మృతి!
- పట్టించుకునే వారు లేక బాధితుల ఆక్రందన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ముందుచూపు లేకుండా కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయం కిడ్నీ రోగులకు మృత్యుపాశంగా మారింది. గడిచిన ఐదేళ్లూ ఎంతో భరోసాతో ఉన్న వారు నేడు నరకయాతన అనుభవిస్తున్నారు. సమస్యలను ఆలకించే వారు కరువై కిడ్నీ బాధితులు, వారి కుటుంబీకులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి.

గతంలో ఇంటి వద్దకే అంబులెన్స్..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 543 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరిలో కొంతమంది 3 రోజులకోసారి, మరికొందరు వారానికోసారి, నెలకు రెండు సార్లు డయాలసిస్ చేయించుకోవాలి. ఇందుకోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల రోగులు అనంతపురం నగరానికే రావాల్సి ఉంటుంది. గతంలో 108 అంబులెన్సులో వచ్చి డయాలసిస్ చేయించుకుని తిరిగి అదే వాహనంలో ఇంటికెళ్లేవారు. అయితే కూటమి ప్రభుత్వం నిర్వాకం కారణంగా అంబులెన్సులను నేడు డయాలసిస్ బాధితుల సౌకర్యార్థం పంపించడం లేదు. 25 రోజులుగా వాహనాలు రావడం లేదని బాధితులు అంటున్నారు. డయాలసిస్ ఒక్క రోజు ఆలస్యమైనా తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుంది. ఈ క్రమంలో వ్యయప్రయాసలకోర్చి నగరానికి రాలేక శ్రీ సత్యసాయి జిల్లాలో ఇద్దరు, అనంతపురం జిల్లాలో ఇద్దరు తీవ్ర అస్వస్థతతో మృతి చెందినట్టు తెలిసింది.

కక్షగట్టి ఆపేశారు..

ముఖ్యమంత్రిగా చంద్రబాబు పగ్గాలు చేపట్టాక 108 పథకానికి పెద్ద గండం వచ్చి పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజునుంచే వాహనాలపై శీతకన్నేశారు. నిర్వహణకు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో వాహనాలు మరమ్మతులకు గురవడం, డీజిల్‌కు కూడా డబ్బుల్లేక ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయి. 2019–24 మధ్య కాలంలో అప్పటి వైఎస్ జగన్ సర్కారు మండలానికి రెండు వాహనాలు ఏర్పాటు చేసి ప్రతి రోగికి వెన్నుదన్నుగా నిలిచింది. అలాంటి పథకం నేడు కొడిగట్టిన దీపంలా మారడం కిడ్నీ బాధితులకు శాపంగా మారింది. ఇటీవల అత్యవసర కేసులకు కూడా సకాలంలో వాహనాలు రావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు మేలు చేస్తున్న పథకాలను కూడా కక్ష సాధింపు ధోరణితో నిలిపివేయడంపై ఉమ్మడి జిల్లావాసులు తీవ్రంగా మండిపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో డయాలసిస్ బాధితులు	543
డయాలసిస్ చేసే ఆస్పత్రులు	05
డయాలసిస్ మెషీన్లు	56
రోజుకు డయాలసిస్ చేసే సంఖ్య (సెషన్స్)	140
ఉమ్మడి జిల్లాలో అంబులెన్సులు	66
బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	54
అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	10
మూలన పడ్డ వాహనాలు	20 వరకూ

చాలా భయమేస్తోంది



కొన్నేళ్లుగా నా భర్త చిరంజీవికి డయాలసిస్ చేయిస్తున్నాం. గతంలో 108 ద్వారా ఆస్పత్రికి తీసుకువచ్చేవాళ్లం. ఇప్పుడు వాహనం రావడం లేదు. వారంలో మూడు రోజులు సర్వజనాస్పత్రికి రావాలి. వచ్చినప్పుడల్లా రూ.300 ఖర్చవుతోంది. ఆటోలో వస్తున్న సమయంలో నా భర్త ఒక్కోసారి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఎప్పుడు ఏమవుతుందోనని భయమేస్తోంది. ఉచిత రవాణా సౌకర్యం కల్పించి మా లాంటి వారిని ఆదుకోవాలి.

– లీలావతి, వడ్డిపల్లి, ఆత్మకూరు మండం

రూ.500 ఖర్చవుతోంది



మా తమ్ముడు సత్యనారాయణ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అతనికి భార్య లేదు. ఇద్దరు పిల్లలు చదువుకునేందుకు వెళ్తుంటారు. డయాలసిస్ కావాల్సినప్పుడల్లా నేనే తీసుకురావాల్సి వస్తోంది. రూ.500 వరకు ఖర్చు చేసుకుని తీసుకొస్తున్నా. పేదోళ్లు ప్రతి సారి రూ. వందలు ఖర్చు చేసుకోవడం చాలా భారమైన పని. డయాలసిస్ చేయించుకుని తీసుకెళ్లేలోపు నా తమ్ముడు నరకయాతన అనుభవిస్తున్నాడు.

– జయలక్ష్మి, ధర్మబిక్షకాలనీ, అక్కంపల్లి

సర్వజనాస్పత్రిలో కేన్సర్ ఓపీ



జీజీహెచ్‌లో కేన్సర్ ఓపీని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడంపై బోధనాస్పత్రి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కేన్సర్ రోగులను గుర్తించడానికి మంగళవారం సర్వజనాస్పత్రిలో ప్రత్యేక ఓపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ ఆస్పత్రిలోని గైనిక్ ఓపీకి ఎదురుగా ఉన్న గదిలో కేన్సర్ ఓపీ ఏర్పాటు చేశామన్నారు. కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే రోగి ఆయుఃప్రమాణం పెంచవచ్చన్నారు. ప్రతి మంగళవారం, గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. రొమ్ముకు సంబంధించి సర్జన్, సర్వైకల్‌కు సంబంధించి గైనకాలజిస్టు, నోటికి సంబంధించి ఈఎన్‌టీ వైద్యులు స్క్రీనింగ్ నిర్వహిస్తారన్నారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలందిస్తున్నామని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, కమ్యూనిటీ మెడిసిన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు, హెచ్ఓడీలు డాక్టర్ రామస్వామి నాయక్, షంషాద్‌బేగం, ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్రశౌరీ, గైనకాలజిస్టు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్క్రీనింగ్ టెస్ట్

అనంతపురం రూరల్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్షల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 10.30 గంటల్లోపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 08554-275575, 7799043773 నంబర్లను సంప్రదించాలన్నారు.

పరిహారం.. పరిహాసం

కొందరికే 'ఇన్‌పుట్'

- ఏడు మండలాల్లో రూ.17.60 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా
- ఈనెల 28న రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా కరువు నివేదిక
- గతేడాది రూ.251.20 కోట్ల సాయంతో ఆదుకున్న జగన్ సర్కారు



ఈ ఏడాది ఆగస్టులో కళ్యాణదుర్గం మండలంలో వర్షాలకు దెబ్బతిన్న టమాట పంటను పరిశీలిస్తున్న జేసీ శివనారాయణ శర్మ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు అందించే పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) పరిహారం పరిహాసంగా మారనుంది. గతి తప్పిన వర్షాలతో జిల్లా అంతటా పంటలన్నీ దారుణంగా దెబ్బతిన్నా కూటమి సర్కారు కంటి తుడుపుగా కరువు మండలాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చంద్రబాబు ప్రభుత్వం పరిహారం ఇచ్చే విషయంలో కూడా రైతులకు చిల్లర విదిలించేందుకు సిద్ధమవుతోంది. కొందరు రైతులకే పరిహారమిచ్చి లక్షలాది మందికి రిక్తహస్తం చూపించనున్నారు.

రూ.17.60 కోట్ల పంట నష్టం..

ఖరీఫ్‌కు సంబంధించి రాష్ట ప్రభుత్వం ప్రకటించిన అనంతపురం, నార్పల, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల్లో పంట నష్టం అంచనాలు పూర్తయ్యాయి. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్‌ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) నిబంధనల మేరకు ఏడు మండలాల పరిధిలో వేరుశనగ, ఆముదం, జొన్న, పత్తి, కొర్ర పంటలు 12,901 హెక్టార్లలో 33 శాతం మేర దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. 11,499 మంది రైతులకు రూ.17.60 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు నివేదిక రూపొందించారు. ఈ మొత్తాన్ని ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో రైతులకు అందించడానికి జిల్లా అధికారులు ఈ నెల 28న ప్రభుత్వానికి పంపనున్నారు.

పట్టించుకునేవారు కరువు..

రైతులకు న్యాయం చేద్దామనే ఆలోచన కూటమి సర్కారు, జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధుల్లో కొంచెమైనా కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదు. ఉష్ణోగ్రతలు, వర్షపాతం, వాతావరణ పరిస్థితి, పంటల సాగు విస్తీర్ణం, పంట కోత ప్రయోగాలు, వాటి దిగుబడులు దాదాపు జిల్లాలో ఉన్న 31 మండలాల్లోనూ అటుఇటుగా ఒకేలా ఉన్నా.. కేవలం ఏడు మండలాలనే కరువు జాబితాలో చేర్చడమే ఇందుకు నిదర్శనం. అన్నదాతల కష్టనష్టాల పట్ల వ్యవసాయశాఖ, జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రకటించిన కరువు మండలాల్లో కూడా రైతులందరికీ న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు. రూ.17.65 కోట్ల పంట నష్టంలో రూ.5.65 కోట్లు యాడికి మండలంలో ఉండగా మిగతా ఆరు మండలాల్లో రూ.12 కోట్లు చూపించారు. ఇక.. పంట నష్టం జాబితాలు ఆర్‌ఎస్‌కేల్లో కంటితుడుపుగా ప్రదర్శించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది రూ.251 కోట్ల ఇన్‌పుట్..

2023– ఖరీఫ్‌లో కూడా ఇలాంటి దారుణ పరిస్థితులే నెలకొన్నాయి. గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లు కరువుతీరా వర్షాలు కురిసినా ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ రూపంలో ఎప్పటికప్పుడు రైతులను ఆదుకున్నారు. ఐదో సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయి. దీంతో అప్పటి జగన్ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి రైతులకు న్యాయం చేసింది. గతేడాది జిల్లాలో 1.99 లక్షల మందికి రూ.251.20 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 1.17 లక్షల మందికి రూ.105.03 కోట్లు... వెరసి రూ.356 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించినట్లు రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

ఆరు నెలలైనా సాయం నిల్..

చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు కొలువుతీరి ఆరునెలలు కావొస్తున్నా తమకు పైసా కూడా అందలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా కింద పెద్ద మొత్తంలో అందాల్సిన పరిహారాన్ని మరిపించగా..'అన్నదాత సుఖీభవ' కింద ఏటా అందిస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని కూడా దాటవేస్తున్నారు. ఇక ఉచిత పంటల బీమా స్థానంలో ప్రీమియం కట్టాల్సిందేనని నిబంధన పెట్టడంతో పరిస్థితి దారుణంగా తయారైందని రైతు ఇంట ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ అయినా అందించి ఉంటే కొంత ఉపశమనం కలిగేదనే అభిప్రాయాలు వ్యకమవుతున్నాయి.

రాజ్యాంగం.. పవిత్ర గ్రంథం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్లను అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్

అనంతపురం అర్బన్: రాజ్యాంగం పవిత్ర గ్రంథం లాంటిదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ వినోద్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగ పీఠికకు వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా దేశాల్లో వివిధ రకాల ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా, ప్రజలు ఆనందంగా ఉండగలిగిన దేశం ఏదైనా ఉంది అంటే అది భారతదేశం మాత్రమేనన్నారు. దేశంలో పుట్టి భారత పౌరసత్వం కలిగిన వారికి రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు వర్తిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, పరిపాల నాధికారి అలెగ్జాండర్, సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరి, రియాజుద్దీన్, జిల్లా పర్యాటకాధికారి జయకుమార్‌బాబు, డీపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

అనంతపురం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ 37 మంది విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్స్, ఆర్టిఫిషియల్ లెగ్స్, సిట్టింగ్ చైర్స్ అందజేశారు. జిందాల్ స్టీల్, ఆర్డీటీ సహకారంతో వీటిని విభిన్న ప్రతిభావంతులకు అందించారు. అంతకు ముందు జిల్లా కోర్టు హాలులో న్యాయాధికారులు, అన్ని కోర్టుల్లో పనిచేస్తున్న సిబ్బందితో ప్రమాణం చేయించారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ పి. జగదీష్ నివాళి అర్పించారు. రాజ్యాంగ పీఠికను చదివి వినిపించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా పాల్గొన్నారు.

నేడు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ నేటి నుంచి రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం కలెక్టర్ వినోద్‌కుమార్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. బుధవారం అనంతపురం జిల్లాలో, గురువారం శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటిస్తారని అధికారులు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులతో మంగళవారం సాయంత్రం కలెక్టర్ వెబెక్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ప్రిన్సిపల్ కార్యదర్శి సమీక్షిస్తారని వెల్లడించారు. ప్రతి మండలం నుంచి ఎంఈఓ-1,2 తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. కోన శశిధర్ జిల్లాలో వివిధ స్కూళ్లు, జూనియర్ కళాశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలించే అవకాశాలున్నాయి. అన్ని పాఠశాలల హెచ్ఎంలు ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉండాలని, అన్ని వివరాలు సక్రమంగా ఉన్న విద్యార్థులందరి అపార్ ఐడీ జనరేట్ పూర్తి చేయాలని, ఇతర అంశాల్లోనూ అప్రమత్తంగా ఉండాలంటూ డీఈఓ విజ్ఞప్తి చేశారు.

మందుబాబులపై 'డ్రోనా'స్త్రం



బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని డ్రోన్ ద్వారా చిత్రించిన దృశ్యం

అనంతపురం: జిల్లా కేంద్రంలోని శివారు కాలనీల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు డ్రోన్లతో నిఘా పెట్టారు. మంగళవారం నాలుగు బహిరంగ మద్యపానం కేసులు నమోదు చేశారు. అనంతపురంలోని ఏ.నారాయణపురం, స్టాలిన్ నగర్, బిందెల కాలనీ, ఎన్టీఆర్ నగర్, లెనిన్ నగర్, రాచానపల్లి సమీపంలోని వంక తదితర శివారు కాలనీల్లో డ్రోన్లను ఎగురవేశారు. వన్‌టౌన్, ఫోర్త్ టౌన్ స్టేషన్ల పరిధిల్లో బహిరంగంగా మద్యపానం చేస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు.

అభాగ్యులు అంతేనా..

అనంతపురం నగరంలో అభాగ్యుల పరిస్థితి దయనీయంగా మారింది. నిరాశ్రయుల కేంద్రాలున్నా ఆశ్రయం దొరకని పరిస్థితి. దీంతో రోడ్లపైన, చెట్ల కింద కాలం వెళ్లదీస్తున్నారు. ఈ వృద్ధుడు ఎవరో తెలియదు కానీ, మూడు రోజులుగా ఇలా జెడ్పీ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కనే పడుకుంటున్నాడు. వాహనాల్లోంచి పడిన కూరగాయలు, పండ్లను కట్టెతో దగ్గరకు తీసుకుని తింటున్నాడు. ఆ మార్గంలో వెళ్లేవారు వృద్ధుడి దీనస్థితిని గమనించి అయ్యో పాపం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల వారు కరుణించి ఆదరించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



క్లుప్తంగా

ఇది ప్రభుత్వ భూమి

- అతిక్రమించి క్రయవిక్రయాలు జరిపితే 6 నెలల జైలు
- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన సిబ్బంది
- కొడిమి వీఆర్‌ఓకు షోకాజ్ నోటీసు


ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 235–2లో రెండు ఎకరాల అస్సైన్డ్ భూమిలో వెలిసిన అక్రమ లేఔట్‌పై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు టీడీపీ చోటా నాయకులు ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించి లేఔట్ వేసి విక్రయాలు చేపట్టిన అంశంపై 'ప్రభుత్వ భూమి.. ప్రైవేట్ లేఔట్!' శీర్షికతో మంగళవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో అనంతపురం రూరల్ మండలం తహసీల్దార్ మోహన్‌కుమార్ సంబంధిత కొడిమి వీఆర్‌ఓ రమేష్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రెన్నెళ్ల క్రితం ప్రభుత్వ స్థలంలో లేఔట్ వేసినా కనీసం అధికారుల దృష్టికి తీసుకురాకపోవడాన్ని సీరియస్‌గా పరిగణిస్తూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం ఆ లేఔట్‌లో నాటిన పసుపు రాళ్లు తొలగించి, ఈ అస్సైన్డ్ భూమిలో ఎలాంటి క్రయ విక్రయాలు, నిర్మాణాలు చేపట్టినా పీఓటీ చట్టం 9/77 ప్రకారం ఆర్నెళ్ల శిక్ష పడుతుందని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. కాగా, పంచాయతీ అనుమతి లేకుండా వేసిన లేఔట్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? నోటీసు ఇచ్చారా? లేదా? అని పంచాయతీ సిబ్బందిని ఆరా తీస్తున్నారు.

పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రాయదుర్గంటౌన్: మండలంలోని చదం రైల్వే గేట్ సమీపంలో పొలంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానిక రైతులు మంగళవారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న పురుషుడి మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేశారు. ఎవరైనా హత్య చేసి పడేశారా? లేక బలవన్మరణానికి పాల్పడ్డాడా అనే కోణంలో విచారణ చేపట్టినట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం


కె.త్రిలోక్

బత్తలపల్లి: బడికని వెళ్లిన విద్యార్థి తిరిగి ఇంటికి చేరలేదు. ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపిన మేరకు.. దంపెట్ల గ్రామానికి చెందిన కె.క్రిష్టప్ప కుమారుడు కె.త్రిలోక్ బత్తలపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం బడికి వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

అట్టుడికిన 'అనంత'

- కార్మికులు, కర్షకులు, ఆశా కార్యకర్తల ఆందోళనల హోరు
- ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ముట్టడి
- రోడ్డుపైనే కలెక్టర్ ఘెరావ్... వినతిపత్రం అందజేత
- డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన ఆశా కార్యకర్తలు



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళుతున్న రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన ఆశా వర్కర్లు

అనంతపురం అర్బన్: ఆందోళనలు... బైఠాయింపులతో అనంత అట్టుడికింది. కర్షక.. కార్మిక హక్కులను కేంద్రం కాలరాస్తోందంటూ కలెక్టరేట్‌ను పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు ముట్టడించారు. హక్కుల సాధనకు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు బైఠాయించారు. అంతకు ముందు ఆందోళనకారులు చేపట్టిన ర్యాలీలతో అనంత వీధులు ఎరుపెక్కాయి.

కార్మిక, కర్షక వ్యతిరేక పాలన

దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, రైతులు, లలితకళాపరిషత్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకుని రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఓబుళు, నాగేంద్రకుమార్, రాజారెడ్డి, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, సురేష్‌బాబు, ఏసురత్నం, చిరుతల మల్లికార్జున, చంద్రశేఖరరెడ్డి, నాగముత్యాలు, బాలరంగయ్య, కేశవరెడ్డి, తదితరులు మాట్లాడారు. కేంద్రంలోని కూటమి సర్కార్ కార్మిక, రైతు వ్యతిరేక పాలన సాగిస్తోందని మండిపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మాభిమానంతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు కనీస మద్దతు ధర చట్టం, సంపూర్ణ రుణమాఫీపై ఎలాంటి స్పష్టత లేదన్నారు. ఫలితంగా రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. వ్యవసాయం, గృహ వినియోగానికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపు చేపడుతున్నారని, ఇది


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల నేతలు

పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్య అని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ పెట్టుబడిదారులకు కార్మికులను బానిసలుగా చేసేలా లేబర్ కోడ్ అమలుకు సిద్ధం కావడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఆశ, అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించడంలేదన్నారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇదే సందర్భంలో కలెక్టర్ వినోద్‌కుమార్ వాహనం అక్కడకు చేరుకోడంతో ఆందోళనకారులు చుట్టుముట్టి ఘెరావ్ చేశారు. కలెక్టర్‌కు పోలీసులు పటిష్ట భద్రత కల్పించారు. అనంతరం కలెక్టర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

రోగులకు సేవచేస్తే పారితోషికం ఇవ్వరా?

అనంతపుం మెడికల్: క్షయ, కుష్టు వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తే ఇస్తామన్న పారితోషికాన్ని ఎగ్గొట్టడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వంపై ఆశ వర్కర్లు మండిపడ్డారు. కూటమి సర్కార్ వైఖరిని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని ఆశా కార్యకర్తలు ముట్టడించారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులకు క్యాట్ 1 కింద ఆరు నెలలు, క్యాట్ 2 కింద ఎనిమిది నెలల పాటు ఆశ వర్కర్లు సేవలందించారన్నారు. రోగి పూర్తిగా కోలుకుంటే క్యాట్ 1 కింద రూ.వెయ్యి, క్యాట్ 2 కింద రూ.1,500 చెల్లిస్తామని గతంలో ప్రభుత్వం హామీనిచ్చిందని గుర్తు చేశారు. అయితే కొన్నేళ్లుగా ఈ పారితోషకం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్‌ఎంలతో చేయించాల్సిన పనులు కూడా ఆశాలతోనే చేయిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవికి వినతి పత్రం అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన టెట్రా ప్యాకెట్లను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కంబదూరు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కుందుర్పి, శెట్టూరు మండలాల్లోని బసాపురం, అనుంపల్లి గ్రామాల్లో ఆ శాఖ అధికారులు మంగళవారం చేపట్టిన తనిఖీల్లో 186 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. ఇందుకు సంబంధించి సుధమ్మ, సురేష్‌ని అరెస్ట్ చేశారు. అలాగే కంబదూరు శివారులోని క్వారీ వద్ద నాటుసారా తయారీ స్థావరాన్ని గుర్తించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తనిఖీలకు ఎక్సైజ్ సీఐలు సునీల్‌కుమార్, అన్నపూర్ణ, ఎస్‌ఐ శ్రీనివాసులు నేతృత్వం వహించారు.

వ్యక్తి ఆత్మహత్య

కణేకల్లు: మండలంలోని బెణికల్లు గ్రామానికి చెందిన బోయ రామాంజినేయులు (40) ఆత్మహత్య చేసుకున్నాడు. మనస్పర్థల కారణంగా తన భార్య ఈరమ్మతో సోమవారం రాత్రి గొడవ పడిన ఆయన తీవ్రమనోవేదనకు లోనై మంగళవారం వేకువజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సామాజిక పింఛన్లపై కూటమి కుట్రలు

- నవంబర్ తర్వాత భర్త మృతి చెందిన వారికే వితంతు పింఛన్
- అంతకుముందు వారికి మొండిచేయి
- తాజాగా సర్క్యులర్ ఇచ్చిన ప్రభుత్వం

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా..నేటి వరకు ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు కాలేదు. అంతేకాక చాపకింద నీరులా పింఛన్లు తగ్గించుకుంటూ వస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పింఛన్ మొత్తం పెంచామని సంబరాలు చేసిన కూటమి ప్రభుత్వం, కొత్త వారికి ఎందుకు పింఛన్లు మంజూరు చేయడం లేదో సమాధానం చెప్పడం లేదు. అసలు పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశమే నేటి వరకు కల్పించకపోవడం గమనార్హం. అర్హత ఉన్న వందలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు.



పక్షపాత ధోరణితో సర్క్యులర్

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను విడుదల చేసింది. కేవలం కొంతమందికి మాత్రమే లబ్ధిచేకూర్చేలా ప్రభుత్వ తీరు ఉంది. వితంతువులు మాత్రమే కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సర్క్యులరులో పేర్కొన్నారు. అది కూడా నవంబర్ ఒకటి నుంచి డిసెంబర్ 1 మధ్య పింఛన్ పొందుతున్న భర్త మృతి చెంది ఉంటే వెంటనే భార్యకు డిసెంబర్ నుంచి వితంతు పింఛన్ అందజేయనున్నట్లు తెలిపారు. అంటే అంతకుముందు జనవరి నుంచి పింఛన్ పొందుతూ భర్తను కోల్పోయిన వితంతవులకు పింఛన్ మంజూరు అవ్వదు. అంతేకాక వారు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా కల్పించలేదు.

అటకెక్కిన హామీ

50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీని ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఊరువాడ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీకి తిలోదకాలు ఇచ్చారు. అసలు కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారో కూడా చెప్పలేని పరిస్థితి.


గతంలో అర్హులందరికీ పింఛన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరు అయ్యేది. ఎలాంటి షరతులు, నిబంధనలు ఉండేవికావు. దరఖాస్తులను సైతం వలంటీర్లే సచివాలయాలకు తీసుకెళ్లి ఆన్‌లైన్ చేసి మంజూరైన వెంటనే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ మొత్తాన్ని అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. ఉన్న వాటిని ఏ విధంగా కోత పెట్టాలనే దానిపై శ్రద్ధ చూపుతుండడంతో అర్హుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఉత్కంఠ భరితంగా బధిరుల క్రికెట్ టోర్నీ

అనంతపురం: అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ స్టేడియం వేదికగా సాగుతున్న బధిరుల జాతీయ స్థాయి అండర్–19 క్రికెట్ టోర్నీ రెండో రోజు ఉత్కంఠగా సాగింది. డెఫ్ ఢిల్లీ, డెఫ్ ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం బరిలో దిగిన యూపీ జట్టు 15.5 ఓవర్లలోనే 169 పరుగులు చేసి విజయం సాధించింది. అలాగే డెఫ్ మధ్యప్రదేశ్, డెఫ్ హర్యానా మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన డెఫ్ మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. అనంతరం హర్యానా జట్టు 122 పరుగులు సాధించి విజయకేతనం ఎగురవేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును హర్యానాకు చెందిన విజయ్ అందుకున్నారు. డెఫ్ ఒడిశా, డెఫ్ ఏపీ జట్ల మధ్య ఏకపక్ష పోరు సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా జట్టు 133 పరుగులు సాధించింది. అనంతరం బరిలో దిగిన ఏపీ జట్టు 8.5 ఓవర్ల వద్ద 42 పరుగులకు కుప్పకూలింది. ఒడిశాకు చెందిన నితీస్ బెహారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. టోర్నీని ఐడీసీఏ సెక్రెటరీ అజయ్, స్పోర్ట్స్ అకాడమీ మేనేజర్ శ్రీదేవి, డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కె.గోపీనాథ్, సత్యనారాయణరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.


క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న దృశ్యం


పుట్టపర్తిని కమ్మేసిన మంచు దుప్పటి


మొక్కలపై మంచు బిందువులు

హిమ సోయగం...

శీతాకాలం.. వాయుగుండం.. అల్పపీడనం... తుపాను ప్రభావం .. కారణాలు ఏవైనా... కరువు కాటకాలకు నిలయమైన జిల్లాలో హిమపాతం కనువిందు చేస్తోంది. చుట్టూ కొండలున్న పుట్టపర్తి ప్రాంతం ఊటీ... కొడైకెనాల్ ప్రాంతాలను మరిపిస్తోంది. సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ ఏకధాటిగా కురుస్తున్న మంచు కారణంగా చలి తీవ్రత పెరిగింది. ప్రకృతి సోయగాలు పర్యాటకులను ఆహ్లాదపరుస్తున్నాయి.

పుట్టపర్తి రూరల్:


ఉదయం 7 గంటల సమయంలో పొలాలపై మంచు


రాత్రి 7 గంటల సమయంలో కురుస్తున్న మంచు


పంట పొలాలపై కమ్ముకున్న మంచు

అటకెక్కిన చదువులు

- 10 రోజులుగా గిరిజన గురుకులాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె
- క్రీడలతో కాలక్షేపం చేస్తున్న విద్యార్థులు
- పది రోజులుగా ఇదే పరిస్థితి


రాగులపాడు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న జూనియర్ అసిస్టెంట్ ముత్యాలప్ప


ఆటల్లో నిమగ్నమైన తనకల్లులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు

ఉరవకొండ: ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలల్లో పాఠాలు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు అటకెక్కాయి. గత పదేళ్లుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 16 నుంచి సమ్మె బాట పట్టారు. ఫలితంగా గిరిజన గురుకులాల్లో బోధన పూర్తిగా నిలిచిపోయింది. దీంతో తమకు తోచిన క్రీడలతో విద్యార్థులు రోజంతా కాలక్షేపం చేస్తున్నారు.

డిమాండ్లు న్యాయపరమైనవే...

ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కారంటూ ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామంటూ నాడు ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా అన్యాయంగా తమను తొలగించే కుట్రలకు తెరలేపారంటూ మండి పడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 1,143 ఔట్ సోర్సింగ్ పోస్టులను డీఎస్సీ నోటిఫికేషన్‌లో చూపించరాదని, 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న తమను కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లుగా గుర్తించాలని, రెగ్యూలర్ ఉద్యోగులతో సమానంగా అన్నీ సౌకర్యాలు కల్పించాలంటూ తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే డిమాండ్లను నెరవేర్చకుండా కూటమి సర్కార్ మొండి చెయ్యి చూపడంతో టీచర్లు సమ్మెలోకి వెళ్లారు. దీంతో పది రోజులుగా గిరిజన గురుకులాల్లో విద్యాబోధన అటకెక్కింది.

సమ్మెలోకి 110 మంది

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 12 ప్రభుత్వ గిరిజన పాఠశాలలు ఉన్నాయి. గోరంట్ల, పెనుకొండ, కదిరి, తనకల్లు, అనంతపురం, ఉరవకొండలో గిరిజన బాలికల పాఠశాలలతో పాటు కదిరి, బుక్కరాయసముద్రం, రాగులపాడు, కళ్యాణదుర్గం, గొల్లలదొడ్డిలో బాలుర పాఠశాలలు, తనకల్లులో కాలేజ్ ఆఫ్ ఎక్స్ ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 3 నుంచి 10వ తరగతి వరకు 1,417 మంది బాలబాలికలు ఉండగా, శ్రీసత్యసాయి జిల్లాలో 1,430 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. కేవలం ప్రిన్సిపాల్ ఒక్కరే రెగ్యూలర్ పద్ధతిలో మిగిలిన 110 మంది ఉపాధ్యాయులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్‌తో పాటు పీఈటీలూ ఉన్నారు. వీరంతా 2016లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కింద నియమితులైనవారే. ప్రారంభంలో రూ.3వేల వేతనం అందిపుచ్చుకున్న వీరు ప్రస్తుతం రూ.12వేల వేతనానికి చేరుకున్నారు. సమ్మె కారణంగా 10వతరగతి విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సిలబస్ పూర్తికాక పోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు

ఉపాధ్యాయుల సమ్మె వల్ల గురుకులాల్లో విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా దగ్గర్లోని ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నాం. కొన్ని పాఠశాలల్లో ప్రిన్సిపాళ్ల ద్వారానే పాఠ్యాంశాలు బోధించేలా చర్యలు తీసుకున్నాం.

– రామాంజినేయులు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, అనంతపురం

ఉద్యోగాలు తొలగించడం దారుణం

తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతిని అందించడంతో పాటు కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు జారీ చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీనిచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాలనూ మోసం చేశారు. పదేళ్లుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తొలగించేందుకు కుట్ర చేయడం సరైంది కాదు. వెంటనే వారి డిమాండ్లను నెరవేర్చి గిరిజన విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలి.

– శివశంకర్‌నాయక్, జీవీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె

మా డిమాండ్లన్నీ న్యాయపరమైనవే. ఉద్యోగ భద్రతతో పాటు 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. మా డిమాండ్లన్నీ నెరవేరేవరకూ సమ్మెలోనే ఉంటాం.

– లోకన్న, ఉపాధ్యాయుడు, గిరిజన బాలుర పాఠశాల, గొల్లలదొడ్డి, గుత్తి మండలం

క్లుప్తంగా

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

అనంతపురం అర్బన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ కాలేదంటూ హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌ను యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకేష్‌కుమార్, నాయకులు జగదీశ్వరరెడ్డి, అరుణ్‌కుమార్, అబ్బాస్ వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని, ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించని కళాశాలలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించినా కొన్ని యాజమాన్యాలు తమ పంథా మార్చుకోలేదన్నారు. అలాంటి కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టాఫ్‌నర్సుల సమస్యలు పరిష్కరించాలి



డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్‌తో మాట్లాడుతున్న ఏపీ నర్సెస్ అసోసియేషన్ నేతలు

అనంతపురం మెడికల్: జిల్లాలో వివిధ పీహెచ్‌సీ, ఏరియా, సీహెచ్‌సీల్లో స్టాఫ్‌నర్సుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్‌బీ పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పీ లత కోరారు. ఈ మేరకు వారు మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ స్టాఫ్‌నర్సుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం అధికారులను అసోసియేషన్ కోశాధికారి సంధ్య అరుణ, నేతలు వై శ్రీదేవి, నాగమణి, అరుణ సన్మానించారు.

మెడికోలకు అభినందన



మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: జాతీయ సాహస శిబిరంలో పాల్గొన్న ప్రభుత్వ వైద్య కళాశాల 2కె23 బ్యాచ్ మెడికోలకు మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు తన చాంబర్‌లో అభినందించారు. ఈ నెల 10 నుంచి 19 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో మనాలిలో జరిగిన సాహస శిబిరానికి అనంతపురం నుంచి మెడికోలు సాయిసుష్మ, జెన్నీ తానియా, హేమంత్‌చౌదరి హాజరయ్యారు. వీరు రాక్ క్లైంబింగ్, రివర్ క్రాసింగ్, ట్రెక్కింగ్, రివర్ రాఫ్టింగ్, తదితర అంశాల్లో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించేందుకు ఇటువంటి శిబిరాలు దోహదపడుతాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ తెలుగు మధు, ఎన్ఎస్ఎస్ పీఓ ఆదిరెడ్డి పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆటోల తనిఖీలు

అనంతపురం: జిల్లాలో ఆటోల ఓవర్‌లోడింగ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ రెండో రోజూ కొనసాగించారు. ఓవర్ లోడింగ్ ఉన్న వాహనాలను గుర్తించి ప్రయాణికులను దింపి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యం చేరుకునేలా సూచనలు చేశారు. సర్వీసు రోడ్డు నుంచి మెయిన్ రోడ్లపైకి వెళ్లేటప్పుడు, జంక్షన్‌లో వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు.

హెచ్ఐవీపై ముగ్గుల పోటీలు



ముగ్గును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతపురం మెడికల్: ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని హైరిస్క్ గ్రూపు, హెచ్ఐవీ బాధితులకు మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి హెచ్ఐవీ బాధితులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముగ్గులు వేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల వివక్ష తగదన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆరోగ్యశాఖ నిరంతరం కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి ఈ నెల 1న ప్రపంచ ఎయిడ్స్ దినం రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, డెమో త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం.. ఒళ్లు హూనం!

- దుస్థితిలో ఆత్మకూరు- పి.యాలేరు రోడ్డు
- వాహనదారులు, ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

ఆత్మకూరు: మండలంలోని ఆత్మకూరు- పి.యాలేరు రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆత్మకూరు నుంచి పి.యాలేరు మీదుగా కూడేరుతోపాటు కరుట్లపల్లి, నారాయణపురం, తిమ్మాపురం, కదదరకుంట, సోల సముద్రం, కోర్రకోడు గ్రామాలకు వెళ్తుంటారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆత్మకూరు నుంచి పి.యాలేరుకు కేవలం మూడు కిలో మీటర్ల దూరం. కాని గ్రామానికి వెళ్లాలంటే దాదాపు 20 నిమిషాలపైనే ప్రయాణించాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. గతుకులు, గుంతలు, కంకర తేలిన రోడ్డుపై వెళ్లడం ప్రయాణికులకు నరకయాతనగా మారింది. అంతేకాకుండా రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు పడి కంకర తేలడంతో ద్విచక్రవాహనాల్లో వెళ్లే ప్రయాణికులు చాలాసార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై నీరు నిలబడటంతో ఇంకా పెద్ద గుంతలు పడి రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు సరిగా లేకపోవడంతో ద్విచక్రవాహనాల్లో ప్రయాణించేందుకు మహిళలు, వృద్ధులు, చిన్నారులు భయాందోళన చెందుతున్నారు.



ప్రయాణానికి అనువుగా లేని పి.యాలేరు రోడ్డు



కంకర తేలి ఇలా..

ప్రయాణం ఇబ్బందికరం



ఆత్మకూరు నుంచి మా గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పెద్ద పెద్ద గుంతలు ఉండటం వల్ల ద్విచక్ర వాహనాల్లో పిల్లల్ని, మహిళల్ని, తీసుకురావాలంటే ప్రమాదకరంగా మారింది. చాలా సార్లు గుంతల రోడ్డులో కింద పడి ప్రమాదాలకు గురయ్యారు.

– ఫణిరెడ్డి, పి.యాలేరు

రోడ్డు నిర్మించాలి



పి.యాలేరుకు వచ్చేవారు రోడ్డు అంతా గుంతలు గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, దిచక్రవాహనాల్లో వెళ్లే వారికి ప్రయాణం నరకప్రాయంగా మారింది. తారు మొత్తం పోయి కంకర తేలి అధ్వానంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

– జయన్న, పి.యాలేరు

పట్టించుకునే వారేరీ?

ఆత్మకూరు- పి.యాలేరు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం ఆ రోడ్డు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదాలకు గురి అవ్వడం చూసి కొంత మంది స్వచ్ఛందంగా గుంతలకు మట్టి వేశారు. కాని వర్షాల కారణంగా ఆ మట్టి కూడా కొట్టుకుపోయి రాళ్లు తేలాయి.

ప్రచార పటాటోపం.. ప్రజలకు శాపం!



టవర్‌క్లాక్ వద్ద యూటర్న్ కనపడకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



సప్తగిరి సర్కిల్ వద్ద ఇలా..



వైఎస్సార్ విగ్రహానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నగరంలో కూటమి నాయకుల ప్రచార పటాటోపం ప్రజలకు శాపంగా మారుతోంది. నగరంలో ప్రధాన రహదారులపై డివైడర్లకు ఫ్లెక్సీలు వేయడంతో రోడ్లు దాటే పాదచారులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూ టర్న్‌ల వద్ద ఫ్లెక్సీలు అడ్డుగా ఉండి వాహనాలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు ప్రముఖుల విగ్రహాలకు అడ్డుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు సిద్దు మాట్లాడుతూ నారాయణ, చైతన్య విద్యాసంస్థలు 2025–26కు సంబంధించి ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ ముందుగా నిర్వహిస్తున్నాయన్నారు. టెన్త్ విద్యార్థుల పరీక్షల సమయం దగ్గర పడుతున్న సమయంలో ఈ విద్యాసంస్థలు పరీక్షలపై శ్రద్ధ చూపకుండా విద్యార్థులను తల్లిదండ్రులు మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. టెన్త్ పరీక్షలు రాయకముందే ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభించి ఒక్కో విద్యార్థి నుంచి రూ. 5,500 నుంచి రూ. 10,500 వరకు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం జిల్లా కన్వీనర్ రజిత, నాయకులు నాగభూషణ, వీరాంజనేయులు, సాయి, చంద్రశేఖర్, మహేష్ ఉన్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం సెంట్రల్: డిజిటల్ మోసాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి సూచించారు. మంగళవారం గుత్తిరోడ్డులోని ఓ హోటల్‌లో ఎస్‌బీఐ ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కస్టమర్ సర్వీసులు మెరుగుదల, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రమేష్‌బాబు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చల్లా కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పవిత్ర గ్రంథం



నగరపాలక సంస్థలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ వసీం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

అనంతపురం సిటీ: ప్రజాస్వామ్య మనుగడకు ప్రధాన కారణమైన రాజ్యాంగం ఓ పవిత్ర గ్రంథమని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ సీఈఓ లక్కిరెడ్డిపల్లి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆమె అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె అంబేడ్కర్ స్ఫూర్తితో రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులకు తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ముఖ్యంగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సామాజిక న్యాయాన్ని, మహిళా సాధికారతను, లింగ సమానత్వాన్ని, సంక్షేమ–అభివృద్ధి, గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్రాన్ని నడిపించారని వివరించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోందని, రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన సమయం కూడా ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. అనంతరం జెడ్పీ ఉద్యోగులతో జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఓలు షబ్బీర్ నియాజ్, ధనుంజయనాథ్, ఉషారాణి, శ్రీవాణి, రత్నాబాయి, జెడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: భారత రాజ్యాంగం ప్రపంచానికి దిక్సూచి అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజమ్మ తో పాటు నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, నాయకులు పెన్నోబిలేసు, రాజగోపాల్, ఎస్టీ సెల్ నాయకులు లక్ష్మణ్ కుమార్, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు హాజరయ్యారు. అలాగే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసినివాళులర్పించారు.

అనంతపురం కార్పొరేషన్: భారత రాజ్యాంగం నిలుస్తోందని ప్రపంచానికే ఆదర్శంగా మేయర్ వసీం పేర్కొన్నారు. 75వ భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటానికి మేయ పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ 1949లో భారత రాజ్యాంగాన్ని ఆమోదించి, 1950 జనవరి 26న అమల్లోకి తీసుకొచ్చారన్నారు. భవిష్యత్తరాలకు రాజ్యాంగం విలువను తెలియజేద్దామన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ నాగరాజు, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సైపుల్లాబేగ్, రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, అబూసలేహా, చంద్రమోహన్ రెడ్డి, లాలూ, శ్రీనివాసులు, సంపంగి రామాంజనేయులు, డీఈలు నరసింహ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య, ఏఓలు

ఆత్మకూరు: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాల, స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంపీపీ హేమలత, తహసీల్దార్ లక్ష్మీనాయక్, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, డీటీ బాలమ్మ, నాయకులు శశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయనగర లా కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై భారత రాజ్యాంగ దినోత్సవ విశిష్టతను గురించి వివరించారు. ఎస్కేయూ న్యాయశాస్త్ర విభాగంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కృష్ణకుమారి అధ్యక్షత వహించారు. రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు హాజరయ్యారు. ప్రధాన వక్తగా రిటైర్డ్ ప్రిన్సిపల్ ఏ. చంద్రశేకర్ హాజరై ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు కొనసాగించాలని ఆకాంక్షించారు. సదస్సు కోఆర్డినేటర్‌గా న్యాయశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్రీరాములు వ్యవహరించారు. సెంట్రల్ యూనివర్సిటీలో సమ్మిళిత రాజకీయాలే భారత రాజ్యాంగ భావన అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు వీసీ ఎస్ఏ కోరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్ ఆర్ గంగాధర్ శాస్త్రి, ప్రొఫెసర్ జి. రామ్ రెడ్డి, రాజనీతి శాస్త్రం విభాగాధిపతి, డీన్ ప్రొఫెసర్ షీలా రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రయ్య, డాక్టర్ సందీప్ , డాక్టర్ సుమన్ దమేరా తదితరులు హాజరయ్యారు.



ఆత్మకూరులో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ



విజయనగర లా కళాశాలలో కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



ఎస్కేయూలో కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

అనంతపురం మెడికల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయులని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి డీఎంహెచ్‌ఓ నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. కార్యాలయం ఏఓ గిరిజ మనోహర రావు, డిప్యూటీ హెచ్‌ఈఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్, డెమో త్యాగరాజు, గంగాధర్, సత్యనారాయణ, నాగన్న, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: దేశ ప్రజల జీవితాల్ని ప్రభావితం చేయడంలో మన రాజ్యాంగం ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుందని పలువురు వక్తలు గుర్తు చేశారు. ఆర్ట్స్ కళాశాల, ఎస్ఎస్బీఎన్ డిగ్రీ, పీజీ కళాశాల, కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని జరుపుకొన్నారు.

డాక్టర్ హేమలతకు జాతీయ స్థాయి అవార్డు



డాక్టర్ హేమలత

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ హేమలతకు ఐఎంఏ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఐఎంఏ కార్యదర్శి డాక్ట్ అనిల్‌కుమార్ జే నాయక్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగే నేషనల్ కాన్ఫరెన్స్ ఉత్సవ్ 2024 జరగనుంది. ఐఎంఏలో వివిధ హోదాల్లో విశిష్ట సేవలందించినందుకు డాక్టర్ హేమలతకు అవార్డు వచ్చిందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

తాగుబోతు వీరంగం

అనంతపురం: నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న రుద్ర వైన్స్ ముందు తాగుబోతు వీరంగం సృష్టించాడు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో రాయదుర్గం వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై రాళ్లతో దాడి చేశాడు. అంతటితో ఆగకుండా బండబూతులు తిడుతూ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేయబోయాడు. నాలుగో పట్టణ పోలీసులు వచ్చి నిందితుడు అహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు.

పాడి పశుపోషణ లాభదాయకం

అనంతపురం సెంట్రల్: మెలకువలు పాటిస్తే పాడి పశుపోషణ లాభదాయకంగా ఉంటుందని గర్భకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ టీవీ సుధాకర్, పశు సంవర్ధకశాఖ జేడీ వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం చియ్యేడు గ్రామంలో గర్భకోశ వ్యాధులపై పశువులకు పరీక్షలు నిర్వహించారు. ఆఖరి దశలో ఉన్నప్పుడు కృత్రిమ గర్భధారణ చేస్తే మాత్రమే చూడి నిలుస్తుందని, విరివిగా లభ్యమయ్యే సుబాబుల్(చిగురు)ను తినిపించాలని వారు రైతులకు సూచించారు. హార్మోన్, పోషకాహార లోపాలు లేకుండా ఉంటే పశువులు త్వరగా చూలు కడుతాయని వివరించారు. డీడీలు రమేష్‌రెడ్డి, సుధాకర్, స్థానిక పశు వైద్యాధికారి శ్వేత, ఎల్ఎస్ఏ మారుతీ కుమార్ పాల్గొన్నారు.

బి.యాలేరు, సనపలో 'పొలం పిలుస్తోంది'

ఆత్మకూరు: బి.యాలేరు, సనప గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని కంది పంటను పరిశీలించారు. ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉందని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేస్తే పంట దిగుబడి ఉంటుందని ఏడీఏ సూచించారు. అనంతరం రబీ సీజన్‌కు సంబంధించి ఇన్సూరెన్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఏఓ సాయిలక్ష్మి, ఏఈఓ సుజిత, వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసులు, ఆశ, రూపేష్, హేమ తదితరులు పాల్గొన్నారు.

రాగివైరు, ఆయిల్ చోరీ

ఆత్మకూరు: ఆత్మకూరు బైపాస్ సమీపంలోని రైతులు సతీష్, విజయ్‌కుమార్ పొలాలకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌నుసోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని రాగి వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.1.70 లక్షలు ఉంటుందని ట్రాన్స్‌కో సిబ్బంది తెలియజేశారు. మండలంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పేషెంట్ పోయె.. చెత్త వచ్చె!



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్ట్రెచర్‌పై చెత్త తరలిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులను తరలించేందుకు స్ట్రెచర్లు కన్పించవు. కానీ చెత్త, గ్యాస్ సిలిండర్లు, మందులు తీసుకు వచ్చేందుకు వాటిని యథేచ్ఛగా వాడుతున్నారు. ఆస్పత్రిలోని ఏఎంసీ పై భాగంలో ఉన్న చెత్తా చెదారాన్ని తరలించేందుకు అక్కడి సిబ్బంది(పారిశుధ్య కార్మికులు కాదు) స్ట్రెచర్‌ను వినియోగిస్తున్నారు. అత్యవసర సమయాల్లో రోగులకు ఉపయోగ పడే స్ట్రెచ్చర్లపై చెత్తా చెదారాన్ని తీసుకెళ్లడంతో స్ట్రెచ్చర్లు దెబ్బతినే పరిస్థితి లేకపోలేదు. స్వచ్ఛంద సంస్థలు, ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన స్ట్రెచ్చర్లను ఇలా ఇష్టారాజ్యంగా వినియోగించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

కారు బోల్తా: దంపతులకు గాయాలు



క్షతగాత్రులను బయటకు తీస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి : మండలంలోని కోన క్రాస్ వద్దకు 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం కారు బోల్తా పడిన ఘటనలో భార్యాభర్తలు గాయాలపాలయ్యారు. ఎస్ఐ సత్యనారాయణ వివరాల మేరకు.. రిటైర్డ్ ఇంజినీర్ వీరన్నగౌడ్, అతని భార్య బసమ్మ కారులో బెంగళూరు నుంచి బళ్లారికి బయలు దేరారు. కోన క్రాస్ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని కారులో ఉన్న వారిని బయటకు తీసి పోలీసు వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులకు స్వల్పగాయాలయ్యాయని వైద్యులు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ శివకృష్ణ

రాప్తాడు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శివకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హెల్త్ కేర్ ఇండ్రస్టియల్ విజిట్‌లో భాగంగా శ్వాస వ్యవస్థ, హ్యూమన్ బ్రెయిన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో ముందంజలో ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయిని అంజనాదేవి, పీఈఓ రాజశేఖర్ రెడ్డి, హెల్త్‌కేర్ ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అల్లరిమూకల హల్‌చల్

అనంతపురం: స్థానిక బైపాస్ రోడ్డులో మంగళవారం రాత్రి అల్లరిమూకలు హల్‌చల్ చేశారు. దివాకర్ పాన్ సెంటర్ వద్ద పాన్ తీసుకుంటున్న అల్లరిమూకలు ఒక్కసారిగా రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులను దుర్భాషలాడారు. దీంతో వారు భయభ్రాంతులకు లోనయ్యారు.

మూడో రోడ్డులో చోరీ

అనంతపురం: స్థానిక మూడో రోడ్డులోని తిరుపాల్ శెట్టి అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. మూడు రోజుల కిందట ఊరెళ్లగా ఇంట్లో ఉన్న 33 తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి బాధితుడి ఇంట్లో సీసీ పుటేజీని పరిశీలిస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

డాక్టర్ అక్బర్‌కు సన్మానం



డాక్టర్ అక్బర్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో 50 వేల కార్నియా ట్రాన్స్‌ప్లాంట్స్ పూర్తయిన నేపథ్యంలో అందులో భాగస్వామిగా ఉన్న అనంతపురంలోని డాక్టర్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ అక్బర్‌ను సన్మానించారు. మంగళవారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఐ బ్యాంకు మేనేజర్ కృష్ణకాంత్, అనంతపురం ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌తో కలిసి డాక్టర్ అక్బర్‌కు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

జేడీఏను కలిసిన అసోసియేషన్ నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: అగ్రి ఇన్‌పుట్ డీలర్ల అసోసియేషన్ నేతలు మంగళవారం జేడీఏ ఉమామహేశ్వరమ్మను కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రేవతి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో పలువురు డీలర్లు మర్యాదపూర్వకంగా జేడీఏను కలిసినట్లు తెలిపారు. టెక్నికల్ ఏవోలు వెంకట్‌కుమార్, రాకేష్‌నాయక్ పాల్గొన్నారు.